క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు జరుగుతుందని ఎంపీడీఓ మంగా కుమారి విలేకరులకు తెలిపారు. ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు. ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

సమావేశ వేళల్లో మార్పు

ముసునూరు: శనివారం ఉదయం 11 గంటలకు జరగాల్సిన మండల పరిషత్ సమావేశం అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. ఈ మార్పును సభ్యులు, అధికారులు గమనించాలని కోరారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మైలవరం: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని మైలవరం మండల విద్యా శాఖాధికారి ఎల్.బాలు అన్నారు. మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాల విద్యార్థులు 158 మందికి కేంద్ర ప్రభుత్వం గిరిజన మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఏర్పాటు చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ చదువులో రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జె.రాధాకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నారుమడిలో తగినంత నీరు ఉంచాలి

చాట్రాయి: వరి నారుమడిలో తగినంత నీటిని నిల్వ ఉంచుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో వర్షాలు కురుస్తున్నాయని, ఈ నేపథ్యంలో వరి నారు మడిలో ఎక్కువగా నీరు ఉంటే కుళ్లిపోతుందని చెప్పారు. తగినంత నీరు నిల్వ ఉంచుకుని మిగిలిన నీటిని బయటకు వదిలివేయాలన్నారు. 3 నుంచి 5 రోజుల వరకు నీట మునిగినా గాలి తగిలేలా చూసుకోవాలని చెప్పారు. ఇందుకు గాను ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ చల్లుకోవాలన్నారు. దీనివలన సమస్యను అధిగమించి తెగుళ్లను తట్టుకుంటుందని చెప్పారు. ముంపునకు గురైతే ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ను వేయడం ద్వారా ముంపు ప్రభావం నుంచి తట్టుకుంటుందని ఆయన వివరించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



తిరువూరు: జగ్గయ్యపేట కోర్టు వద్ద విజయవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు గొట్టిక శివకృష్ణారెడ్డిపై దాడి ఘటనను నిరసిస్తూ గురువారం తిరువూరులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదులపై దాడులను అరికట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కోర్టు ఎదుట జరిపిన ఆందోళనా కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామ దేవతకు కిరీటం సమర్పణ



గంపలగూడెం: గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి భక్తుడు గురువారం ఇత్తడి కిరీటాన్ని సమర్పించారు. గంపలగూడెంకు చెందిన కుమ్మరికుంట జనార్ధనరావు, సావిత్రమ్మల పేరు మీద వారి మనుమడు కొల్లా మురళీకృష్ణ, దీప్తి దంపతులు ఈ కిరీటాన్ని తయారు చేయించి ఆలయ కమిటీ సభ్యుడు బొడ్డు నరసింహారావుకు అందజేశారు.

దోమల లార్వా నివారణకు చర్యలు

గంపలగూడెం: విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో గంపలగూడెం పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం దోమ లార్వా నివారణకు చర్యలు చేపట్టారు. సర్పంచి కోట పుల్లమ్మ పర్యవేక్షణలో సిబ్బంది నిరుపయోగంగా ఉన్న బావులు, మురుగుకాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ప్రజలు స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సర్పంచి సూచించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోజంతా ముసురు వర్షం



నూజివీడు పట్టణంలో నెలకొన్న ముసురు వాతావరణం



ఆగిరిపల్లిలో నెలకొన్న ముసురుతో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

- ఉదయం నుంచే చిరు జల్లులు
- విద్యార్థులు, ఉద్యోగుల ఇబ్బందులు
- ఇళ్లకే పరిమితమైన ప్రజలు
- వ్యాపారాలు సాగని వైనం

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో నూజివీడు, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో గురువారం ఎడతెగని ముసురు నెలకొంది. ఉదయం 7 గంటల నుంచి ఒక మోస్తారు చిరు జల్లులు, భారీ జల్లులు పడుతూనే ఉన్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు తమ కార్యాలయాలకు వెళ్లేందుకు, విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు, తిరిగి వచ్చేటప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొందరైతే వర్షంలో తడుస్తూనే ఆఫీసులకు, పాఠశాలలకు చేరుకున్నారు. ఒకటే ముసురు నెలకొని ఉండటంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వ్యాపారాలు లేక దుకాణదారులు ఖాళీగా కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరైతే అసలు షాపులనే తెరవలేదు. నియోజకవర్గ వ్యాప్తంగా వరి నాట్లు వేస్తుండటంతో ఈ వర్షం వరి పొలాలకు ఉపయోగమని రైతులు పేర్కొంటున్నారు. అయితే భారీ వర్షం కురిస్తే మాత్రం వారం రోజుల లోపు నాట్లు వేసిన పొలాల్లో నాట్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

● **చాట్రాయి:** అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా మండలంలో వర్షం కురిసింది. ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేదు. రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. ఉప్పు వాగు, రేగడి వాగుల్లో స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిసర ప్రాంతాలతో పాటు మండలంలో కురుస్తున్న వర్షానికి తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకి స్వల్పంగా వరద నీరు చేరుతోంది. ఉదయం 7 గంటలకు 2.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ తెలిపారు.

ఎడతెరిపి లేని వర్షం

తిరువూరు: అల్పపీడనం కారణంగా తిరువూరు మండలంలో బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది. గురువారం సాయంత్రం వరకు 5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లోని గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల్లో కూడా వర్షం కురవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. కట్టలేరు, పడమటివాగు, వెదుళ్లవాగు, విప్పలవాగులలో వరదనీరు చేరుతోంది.



చిన్నంపేట వద్ద తమ్మిలేరు వాగులో ప్రవహిస్తున్న వరద నీరు

● **ముసునూరు:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో ఒక మోస్తరు జల్లులతో వర్షం కురిసింది. బుధవారం రాత్రి నుంచి ప్రారంభమై గురువారం రోజంతా కొనసాగిన ముసురుతో చిరు జల్లుల పడడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే చేయాలి

మండల ప్రత్యేకాధికారి వెంకట నారాయణ



గంపలగూడెం పీహెచ్‌సీ తనిఖీ చేస్తున్న ప్రత్యేకాధికారి వెంకటనారాయణ

గంపలగూడెం: సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. మందుల సరఫరా, రోగులకు అందుతున్న వైద్యసేవలపై వైద్యాధికారి భార్గవిని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున నియంత్రణకు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులను పరిశీలించారు. అనంతరం గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని నాణ్యతా ప్రమాణాలతో అందించాలని ఉపాధ్యాయులకు, వంట ఏజెన్సీకి సూచించారు. బియ్యం స్టాకు పరిశీలించారు.

మండల స్థాయి అధికారులతో సమీక్ష..

తొలుత మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువయ్యేలా కృషి చేయాలన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు సక్రమంగా అమలు జరిగే విధంగా ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ తప్పక చేయాలని, దోమల నిర్మూలనకు ఎబేట్ మందు పిచికారీ చేయించాలని ఆదేశించారు. తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, గంపలగూడెం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



స్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సునీత

తిరువూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు మండల ప్రత్యేకాధికారి జె. సునీత అన్నారు. స్థానిక అభ్యుదయ పాఠశాలలో గురువారం విద్యార్థుల హాజరును పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే విద్యార్థులుంటే గుర్తించి వైద్య పరీక్షలు చేయించాలని, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధుల నియంత్రణకు అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంఈఓ శ్యాంసుందర్, మున్నీ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అందిస్తాం

తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు



కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మల్లేల(తిరువూరురూరల్): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు తనవంతు చేయూత అందిస్తానని తిరువూరు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మల్లేల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వల్లంపట్ల నుంచి మల్లేల ఉన్నత పాఠశాలకు వచ్చే విద్యార్థినులకు సైకిళ్లను తాను వితరణ ఇస్తానని చెప్పారు. లింగం ఉషారాణి, ఉమామహేశ్వరరావులు పాఠశాల ల్యాబ్‌కు వితరణ ఇచ్చిన రూ.5 లక్షల విలువైన 20 కంప్యూటర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చదువే మన సంపద అనే అంశంపై ఆగస్టు 11న మల్లేల పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి 15న విజేతలకు నగదు బహుమతులు అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో తిరువూరు ఎంఈఓ రామకృష్ణ, మల్లేల జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఏసీపీ మురళీమోహన్



మాట్లాడుతున్న ఏసీపీ మురళీమోహన్

మైలవరం: మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మైలవరం ఏసీపీ మురళీ మోహన్ అన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లలను డ్రగ్స్‌కు అలవాటు పడకుండా జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. మైలవరం సీఐ కిశోర్‌బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలైన వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి సరైన మార్గంలోకి తీసుకురావాలన్నారు. మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి వారి సమాచారం తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హరిప్రసాద్, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె. అప్పారావు, డాక్టర్ ఇళ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

పాడిగేదెలనూ వదలడం లేదు

- వరుస చోరీలతో పాడి రైతుల ఆందోళన
- సీసీ కెమెరా వీడియోల ఆధారంగా పోలీసుల దర్యాప్తు



మునగపాడు గ్రామంలో పాడిగేదెను అపహరించి తీసుకెళ్తున్న దొంగలు



పాడిగేదెను తీసుకు వెళ్లేందుకు దొంగలు తీసుకువచ్చిన మినీ వ్యాను

జి.కొండూరు: చెడు వ్యసనాలకు బానిసలైన కొందరు ఈజీ మనీకి అలవాటుపడి డబ్బు, బంగారం, బైకులు దొంగతనం చేస్తుంటారు. ఇటీవల జరుగుతున్న కొన్ని దొంగతనాలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. రైతులు తమ సంప్రదాయ వ్యవసాయంలో భాగంగా ఎంతో అప్యాయంగా పెంచుకునే పాడి గేదెలను సైతం దొంగలు వదలడంలేదంటే దొంగతనాలు ఏ స్థాయికి చేరుకున్నాయో ఇట్టే అర్థమవుతుంది. జి.కొండూరు మండల పరిధి మునగపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు పాడి గేదెను అపహరించిన ఘటన స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో గ్రామస్తులు అవాక్కయ్యారు. మినీ వ్యానులో వచ్చిన కొందరు వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామానికి చెందిన రైతు రామిశెట్టి రామారావు పాడి గేదెను గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వ్యానులో తరలించినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయిన వీడియోనిబట్టి అర్థమవుతోంది. ఇదే గ్రామ శివారులోని మామిడితోటలో గరికపాటి సురేష్ అనే వ్యక్తి పెంచుతున్న ఆరు కోడి పుంజులను సైతం దొంగలు బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఇదే తరహాలో గ్రామానికి చెందిన రైతు తలపురెడ్డి కోటిరెడ్డి అప్యాయంగా పెంచుకుంటున్న గేదెను ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో అపహరించారు. మునగపాడు గ్రామంలో ఇటీవల జరిగిన బైకు దొంగతనాలు మరవకముందే పాడి గేదెల దొంగతనాలు వరసగా జరుగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆధార్ నమోదు శిబిరాల షెడ్యూల్ విడుదల

ముసునూరు: మండల వ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్న ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ శిబిరాల షెడ్యూల్‌ను గురువారం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి తెలిపారు. ఈ నెల 23న వేల్పుచర్ల, బలివే గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి వేల్పుచర్ల గ్రామ సచివాలయంలో, 24న గోపవరం- 1, 2, కాట్రేనిపాడు సచివాలయాల పరిధిలోని వారికి గోపవరం-2 గ్రామ సచివాలయంలో, 25న ముసునూరు-1, 2, చింతలవల్లి, కొర్లగుంట సచివాలయ పరిధిలో వారికి ముసునూరు-2 గ్రామ సచివాలయంలో శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 26న రమణక్కపేట, సూరేపల్లి, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి అక్కిరెడ్డిగూడెం సచివాలయంలో, 27న గుళ్లపూడి, వలసపల్లి, లోపూడి గ్రామ సచివాలయాల పరిధిలోని వారికి గుళ్లపూడి గ్రామ సచివాలయంలో ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధార్ నమోదు శిబిరాలు జరుగుతాయన్నారు.

వాహన చోదకులు హెల్మెట్ ధరించాలి

15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు

నూజివీడు: ద్విచక్ర వాహన చోదకులు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను ధరించి ప్రయాణించాలని, అప్పుడే ఏదైనా ప్రమాదం సంభవించినా ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. మైలవరం రోడ్డులోని కోర్టు భవనాల నుంచి పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. జడ్జి నాగశైలజ మాట్లాడుతూ కేవలం నిబంధనల కోసమో, పోలీసులు వేసే జరిమానా కోసమో హెల్మెట్‌ను ధరించడం కాకుండా మన భద్రత కోసం, మనపై ఆధారపడి ఉన్న వారి కోసం ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ఇద్దరు ప్రయాణిస్తుంటే ఇరువురూ హెల్మెట్‌ను ధరించడం మంచిదని చెప్పారు. రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మరణాలకు కారణం హెల్మెట్‌ను ధరించకపోవడమేనని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. డీఎస్పీ జి. లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రాణాలను రక్షించుకునేందుకు, ఇంటి వద్ద ఆశగా మీకోసం ఎదురు చూసే మీ ఆప్తుల కోసం ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్‌ను ధరించాలన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు తలకు తగిలే గాయాలను తగ్గించడంలో హెల్మెట్ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్దఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి శివపార్వతి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు, స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, సీఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మయ్య

హెల్మెట్ ధారణపై అవగాహన..

నూజివీడు: ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు వాహనాన్ని నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వ్యక్తి సైతం హెల్మెట్‌ను ధరించాలని డీఎస్పీ గోలి లక్ష్మయ్య అన్నారు. పట్టణంలోని శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలలో హెల్మెట్ వాడకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాన్ని తీస్తే పిల్లలుగా మీరు హెల్మెట్‌ను ధరించాలని చెప్పి వారిని చైతన్యవంతులను చేయాలన్నారు. హెల్మెట్‌ను ధరించడం వల్ల రోడ్డు ప్రమాదంలో తలకు గాయం కాకుండా ఉంటుందని, తద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, ఎస్‌ఐ రామకృష్ణ, ఏఎస్‌ఐ బేగ్, సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు

ఆగిరిపల్లి: మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు అందిస్తామని పౌర సరఫరాల శాఖ డీటీ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆగిరిపల్లిలో కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. విక్రయ కేంద్రంలో కందిపప్పు రూ.160, బియ్యం రూ.49కి అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

మాజీ మునసబు దాస్ మృతి



చిట్టేల(తిరువూరురూరల్): మండలంలోని చిట్టేల గ్రామ మునసబుగా, వీఆర్వోగా పనిచేసి పదవీ విరమణ చేసిన కొల్లి వైకుంఠనాథ దాస్ (80) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. దీర్ఘకాలం ఆయన గ్రామ రెవెన్యూ అధికారిగా సేవలందించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వైకుంఠనాథ్ దాస్ మృతికి సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు, పలువురు ఉద్యోగులు సంతాపం తెలిపారు.

మొక్కలు నాటిన లయన్స్ సభ్యులు

తిరువూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం ఆవరణలో గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఇంటింటా మొక్కలు నాటాలని క్లబ్ అధ్యక్షుడు పసుమర్తి వెంకటేశ్వరరావు సూచించారు. క్లబ్ సభ్యులు తాళ్లూరి రామకోటేశ్వరరావు, సంకురాత్రి జనార్ధనరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నా, బొడ్డు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మకు ఆషాఢం సారె



ఇబ్రహీంపట్నం: తూర్పు ఇబ్రహీంపట్నం కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గంగానమ్మ అమ్మవారికి ఆషాఢం సారెను మహిళలు గురువారం సమర్పించారు. ముందుగా కోదండ రామాలయంలో సీతమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా గంగానమ్మ దేవాలయానికి చేరుకుని సారె సమర్పించి పూజలు జరిపారు. మహిళలతో పాటు రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల సంరక్షణే మిషన్ శక్తి లక్ష్యం

ఐసీడీఎస్ నూజివీడు సీడీపీఓ ఎస్వై నూరానీ



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ ఎస్వై నూరానీ

నూజివీడు: మహిళలు, బాలికల సంరక్షణే మిషన్ శక్తి లక్ష్యమని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీఓ ఎస్వై నూరానీ అన్నారు. నూజివీడులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లకు, మహిళలకు, బాలికలకు మిషన్ శక్తిపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అక్టోబర్ నాలుగో తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. బాలికలు, మహిళల రక్షణ కోసం మూడు చట్టాలున్నాయని, వాటిపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలు చేస్తే వరుడికి ఏడేళ్ల వరకు, తల్లిదండ్రులకు రెండేళ్ల వరకు శిక్ష విధిస్తారన్నారు. బాలికల వివాహ చట్టం, ఉద్యోగం చేసే మహిళలపై వేధింపుల నిరోధక చట్టం, మైనర్లపై అత్యాచార నిరోధక చట్టం అమలులో ఉన్నాయన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించాలని, తద్వారా జీవితంలో ఆర్థికంగా ఇబ్బందులు లేకుండా జీవనం సాగించడానికి వీలవుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు జిల్లా కలెక్టర్ రాక

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన శుక్రవారం ఎ.కొండూరు మండలం చీమలపాడు శివారు పెదతండాలో పర్యటిస్తారని ఐసీడీఎస్ తిరువూరు సీడీపీఓ సత్యవతి తెలిపారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శిస్తారని చెప్పారు.

అనాథ బాలలకు అన్నదానం

తిరువూరు: హిమశ్రీ రెస్టారెంట్ నిర్వాహకుడు బండ్లమూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక పరిపూర్ణ సేవా సంస్థలోని అనాథ బాలలకు గురువారం అన్నదానం చేశారు. సేవా సంస్థ నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

ముసునూరు: ముసునూరులోని బాలికల గురుకుల పాఠశాలను గురువారం ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి సౌకర్యాలను, తాగునీటి సరఫరా ట్యాంక్‌లను, టాయిలెట్లను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణ, సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం పరిశీలన

చిట్టేల(తిరువూరురూరల్): చిట్టేలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం మండల ప్రత్యేకాధికారి జె. సునీత పరిశీలించారు. శిబిరంలో జ్వర పీడితులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, రోజుల తరబడి జ్వరం తగ్గకపోతే బాధితులను వైద్యశాలకు తరలించాలని వైద్య సిబ్బందికి ఆమె సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.